# 2 ఖరీదైన ఉత్తరం

క్యాన్‌టీన్‌లో కాఫీతాగి, గేటుదగ్గర కిళ్లీలు కొనుక్కుని, రోడ్డుమీద సిగరెట్‌లు వెలిగించుకుని, తూర్పుగా బయలుదేరి, తిన్నగా పోస్టాఫీసుకుపోయి ఉత్తరాలకోసం చూసుకుని, ఆ దారిన బీచ్‌కి పోయి ఆరు గంటలదాకా బాతాఖానీ వేసుకుని రాత్రినుంచీ రాబోయే పరీక్షలకి చదవడం గురించి నాలుగుసార్లు చర్చించుకుని ఈ రోజు నుంచీ జాగ్రత్తగా చదివెయ్యాలని తీర్మానించుకుని బలపరచుకుని, హోస్టలు గురించీ, ఓడిపోయిన మంత్రులని గురించీ అమ్మాయిలను గురించీ ఇష్టం వచ్చిన ఉద్దేశాలు వెలువరించుకుని, రూముకి తిరిగి వచ్చి అవన్నీ మరచిపోవడం భజగోవిందరావుకీ, పరమానందానికీ దినకృత్యాలు.

భజగోవిందరావుకి రోజూ ఒక కవరో, కార్డో ఇవ్వడమూ, ప్రతిరోజూ పరమానందం అడక్కుండానే ఉత్తరాలు లేవని చెప్పడం పోస్టుమాన్‌కి గతి తప్పని అలవాటు.

ఉత్తరాలు లేకపోవడం ఒక ఎత్తూ, అందరికీ వస్తూ, ముఖ్యంగా రూంమేటుకి అనుదినమూ అనేకాలు(ఒకటికన్న ఎక్కువ) వస్తూ, ఏనాటికీ పరమానందానికి ఒక్క ఉత్తరమూ రాకపోవడం

రెండో ఎత్తూను. ఉత్తరం రాగానే సీరియస్‌గా విప్పేసి, రెండు సార్లు చదివేసి, అందులో ఏదో మహత్వం ఉన్నట్టు ఒకసారి గంభీర మైన చూపొకటి పారేసి, రెండో ఉత్తరం తీసి చదువుతూ, ఇలాగ అవుతోంటే పరమానందానికి చాలా కష్టం అనిపించింది. ఉత్తరాలు రావడం నాగరికతకో చిహ్నమనీ, పూర్వం అంటే కాళిదాసు కాలంలో ఈ పద్ధతి లేకనే మేఘాలద్వారా సందేశాలు పంపుకొనే వారనీ, ఆ పద్ధతి చాలా శ్రమకరమైనదే కాక, ఒకే మేఘంద్వారా ఒక తరుణీ, ఒక తరుణుడూ తమ ప్రియులకి రాయబారాలు పంపిం చితే అలాటి సందేశాలు తారుమారై చాలా ప్రమాదాలు జరిగి వుండా లనీ, వాటన్నిటినీ తొలగించి, భావావేశమూ పాటలు రాసుకోవడమూ లాంటి కష్టాలు లేకుండా, ఆ ఆనందాన్ని అనుభవించేలాటి పద్ధతి పోస్టల్ సిస్టం అనీ పరమానందం వ్యక్తిగతోద్దేశం. ఈ రోజుల్లో ఇంకా మేఘ సందేశాలే (తెరమీద) జరుగుతోంటే తనకి పోస్టుకార్డు సందేశమైనా, ప్రేయసి దగ్గరనుంచి కాకపోతే మిత్రులదగ్గర నించేనా రాకపోవడం పరమానందరావుకి కాలేజీలో చదువుకొంటున్న ఆనం దానికి కళంకము తెచ్చాయి. చాలాసార్లు అతను తన అడ్రసుకు ఉత్తరాలు రాసుకుని అందుకుని భజగోవిందరావు తలతిరుగుడు తానే కట్టిద్దా మనుకున్నాడు. కాని అంతరాత్మ అనే ఒక దరిద్ర గ్రహం అలాటి యోగాన్ని పట్టనివ్వలేదు.

పరమానందరావుకి ఉత్తరాలు అంతగా అసలే రావడం ఎందుకు మానెయ్యాలో చెప్పడం అవసరం. అతనికి తల్లీ తండ్రీ లేరు. అన్నగారు ఆస్తి పంపకాల అనంతరం ముందు కార్డు ఖర్చులూ, తరవాత మాటలూ మానేశారు. మామగారు అతని పెళ్ళికి ముందే పరమపదించారు. ఆయన భార్యకీ, కుమార్తెకీ అంటే పరమా నందరావు అత్తగారికీ భార్యకీ, అక్షరాస్యతకీ మధ్య అనంతదూరం. ఆ విధంగా ప్రేయసి లేఖలు వచ్చే అదృష్టంలేదు. ఇంక స్నేహితు లంటే, పరమానందరావు డబ్బు ఖర్చు దగ్గర చాలా జాగ్రత్త కలవాడు అంచేత అతనికి స్నేహితులు సుమారుగా లేకపొయ్యారు;

ఉన్న స్నేహితుడు సుబ్బారాయు డొకడూ వాళ్ళ ఆఫీసరు ధర్మమా అని చచ్చిన వాళ్ళలో జమ అయాడు.

పత్రికలకి కథలు పంపడం చెయ్యకూడదా? అని ఒకనాడు అనుకున్నాడతను. కాని ఏమిటి రాయడమో బోధపడలేదు. పోనీ ఈ మధ్య రచయితలు చేస్తున్నట్లు ఏ విల్డర్‌నో తెలుగులో కూనీ చేసి ఆ మాట చెప్పకుండా పంపకూడదా అంటే: ఒకటి, ఆ రచన అచ్చైనా కాపీ వచ్చే నిర్ధారణ లేదు; రెండు: రచనని పోస్టుబిళ్లలతో పంపినా, అవి అసలే తిరిగిరావు. శ్రమ చాలాను.

పరమానందరావుకి దారి కనపడలేదు. ఏ పోస్టల్ ట్యూషన్ తోనో కరెస్పాండెన్సు మొదలుపెడదా మంటే కొంత డబ్బు తగ లెయ్యడం అతనికి యిష్టంలేదు.

చివరికి అతనూరుకున్నాడు, కింకర్తవ్యతా మూఢుడై.

గోవిందరావు ఊరుకోక ఒకనాడు బీచ్‌లో మామూలు సంభాషణని మార్చి, "నీకెప్పుడూ ఉత్తరాలు రావేంరా?" అన్నాడు.

మొగుడు కొట్టాడని ఏ పతివ్రతకీ కోపంరాదు కాని, తోటి కోడలు చూస్తే అది వేరే విషయం. కాస్త పెద్దమనిషి ఎలెక్షన్లో ఓడిపోతే నాలుగు వారాలు గ్రామాంతరం వెళ్ళిపోతాడు.

పరమానందం చాలా బాధపడి, "రావు" అన్నాడు.

"ఉత్తరాలు రావడంలో ఎంత అందం వుందంటావ్? కాస్త మనవాళ్ళ మంచీ చెడ్డా తెలుస్తూంటై. అదీకాక నాగరికతలో అదొక భాగమోయ్ ఆనందం" అన్నాడు గోవిందరావు.

"కాని, ఉత్తరాలు రానంతమాత్రాన నువ్వు నన్ను అనాగరికుడిగా జమకట్టవు కదా?"

"అదీ ఆలోచించదగ్గ విషయమేలే."

"అయినా నాకు చాలా అసహ్యం ఉత్తరాలంటే."

"అదే - వెనకటికి నక్కకి ద్రాక్షపళ్ళు పుల్లగా వున్నాయట." న్నాడు

పరమానందం నవ్వి, సముద్ర తరంగాలవైపు చూస్తూ ఊరుకున్నాడు. మిత్రుడూ ఆలోచనలోకి జారాడు. కొంచెం సేపయ్యాకియైన

గోవిందరావు హటాత్తుగా లేస్తూ, "ఒరేయ్- నాదో ఉత్తరం నువ్వు తీసుకుంటావురా? అయిదు రూపాయిలు నువ్విచ్చీడం, ఈ నెల పదహారో తారీకున నువ్వు నా ఉత్తరం తీసుకోవడమూను."

"నాకేమిట్రా లాభం?"

"ఆ ఉత్తరమే."

గోవిందరావు ఆలోచించాడు.

"సరే, రూముకి పోగానే ఇస్తాను అయిదు రూపాయిలూను. పదహారో తారీఖున నేనే ఉత్తరం పోస్టుమేన్ నించి తీసుకుంటాను. నువ్వు దాన్ని చూడనే కూడదు."

"సరే, ఒప్పుకున్నాను."

* * *

పదహారో తారీఖున భజగోవిందరావు బైట నిలబడ్డాడు. పరమానందరావు మాత్రం లోనికి వెళ్ళివచ్చి, ఒక కార్డుతెచ్చి అతనికిస్తూ "ఒక కవరుత్తరం నేను తీసుకున్నాను. ఇది తీసుకో" అన్నాడు.

ఉత్తరం చదువుకుని గోవిందరావు నిశ్శబ్దంగా ఆనందంతో బీచ్‌కి బయలుదేరాడు.

బీచ్‌లో కూర్చుంటూ ఆనందం "మన దేశంలో సూర్యరశ్మితో వంటచేసే యంత్రం కనిపెట్టారట....నెహ్రూ చెప్పాడు" అన్నాడు.

గోవిందరావు బుర్ర ఈ విషయాలగురించి ఆలోచించే పరిస్థితిలో లేదు. ఆనందరావు తీసుకున్న ఉత్తరం ఏమిటా అని అతను ఆలోచిస్తున్నాడు. "కవరా తీసుకున్నానన్నావు?" అన్నాడు దిగులుగా పరమానందకేసి చూస్తూ. పరమానందం మాత్రం ఏమీ చెప్పకుండా, "ఉత్తరం గురించి ఏ విషయం కావలసినా డబ్బు వాపస్ ఆనవ్వాల్సి వుంటుంది" అన్నాడు.

ఆ సాయంకాలం అంతా గోవిందరావు సరిగ్గా లేడు. ఆ ఉత్తరం ఎవరు వ్రాసినది? అనే ప్రశ్న అతన్ని వెంటాడుతోంది— గిరీశం వర్ణించిన మన్మథుడి బాణాలతో.

మర్నాడు గోవిందరావు పోస్టుమేన్‌ని రహస్యంగా, "నిన్న నాకు వచ్చిన కవరు ఎలాగ ఉందో జ్ఞాపకం వుందా?" అన్నాడు.

పోస్టుమేన్ నవ్వుతూ—"పారేశారా బాబూ?" అన్నాడు.

గోవిందరావు తల వూచాడు.

"నీలిరంగు కవరు బాబూ—అంతా సెంటు వాసనే. మీ రూం మేటు తీసుకెళ్ళారు. అమ్మగారు...."

పోస్టుమేన్ నవ్వాడు. గోవిందరావు బైటపడ్డాడు. అతని ముఖంలో చెమటలు పోశాయి.

ఈ మధ్య కాలేజీబ్యూటీ స్వర్ణ తనని చాలాసార్లు గమనిస్తూందని చాలా రూమర్స్ బయలుదేరాయి కొంపతీసి ప్రేమ కాదు కదా? ఆవిడే అయి వుంటుంది. తనకి ఉత్తరం రాసి వుంటుంది.

లేక, శకుంతలా?

శకుంతల గోవిందరావు చిన్ననాటి స్నేహితురాలు. ఇలాగ ఉత్తరం రాసేంతగా ఆమె తనని ప్రేమిస్తోందా? ఏమో? క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అన్నారు. ఎవరుకన్నా రెవరు విన్నారు?

అయినా చెత్త అయిదు రూపాయలకోసం తనకీ బుద్ధి ఎందుకు పుట్టాలి? అంత చక్కని ఉత్తరం ఆ రోజునే రావాలా? ఆ రోజు బీచ్‌లో సెంటు వాసన తన రుమాలునించే ననుకున్నాడు. అసలు సంగతి అదా?

కొంపతవ్వి, అనందరావు ఆ అమ్మాయిని బ్లాక్ మెయిల్ చెయ్యడుకద? ఏమో! డబ్బుకోసం వాడేపనైనా చెయ్యొచ్చు

ఆ ఉత్తరం ఎవరు వ్రాసినా, ప్రమాదమే.

గోవిందరావు నాలుగు భజగోవింద శ్లోకాలు చదువుకున్నాడు ఆనందం మనస్సు మార్చాలని ప్రార్థిస్తూ.

రూములోకి ఆనందం రాగానే, కార్యసాధకత్వానికి సరియైన

ఉపోద్ఘాతం ప్రారంభిస్తూ "నీ డబ్బు అన్యాయంగా తినడం చాలా కష్టంగా వుందిరా. ఇవిగో, నీ అయిదు రూపాయలూ తీసుకో. నా లెటర్ ఇచ్చేశెయ్" అన్నాడు గోవిందరావు.

ఆనందం చిన్న నవ్వు విసరేసి "నీ కివాళదాకా వున్న అభిప్రాయాలన్నీ మారాయా? లేక ఇదొక్కటేనా?" అన్నాడు.

పరోపకారి పోజువేస్తూ గోవిందరావు "అదేం లేదులేరా, కాని నీ డబ్బు నా కక్కరలేదు. తీసుకో" అన్నాడు అయిదు రూపాయిలు బైటపడేస్తూ.

ఆనందం వాటిని ముట్టుకోకుండా, సిగరెట్ వెలిగించి, సావకాశంగా కొంచెం వక్కపొడి నోట్లో వేసుకుని, "నేనంత నీచుణ్ణి కాదురా బ్రదర్!" అన్నాడు.

గోవిందరావు తెల్లబోయాడు. "నే నలా ఏమన్నాన్రా?"

"నువ్వేమీ అన్నావనికాదు. కాని ఆడినమాట తప్పడం నా నిఘంటువులో లేదురా."

"పోనీ, ఈ అయిదు రూపాయలూ తీసుకుని ఆ ఉత్తరం ఒక్కసారి చూపెట్టు."

"నీ కనీసపు కోర్కె తీర్చలేనందుకు చాలా విచారిస్తున్నాను. క్షంతవ్యుణ్ణి."

గోవిందరావు అనుమానాలన్నీ ధృవపడ్డాయి. కాని, స్వర్ణా, శకుంతలా, అని?

"అయితే ఇవ్వవన్రా?"

"చాలా విచారం బ్రదర్!"

కాలేజీలో స్వర్ణ గోవిందరావుని చూసి ముఖం ముడుచుకుంది. గోవిందరావు గుండె ఝల్లుమన్నది. 'ఔనుమరి....ఏ నాయికతన ప్రణయ లేఖకి జవాబివ్వని ప్రియుణ్ణి క్షమిస్తుంది?' అనుకున్నాడు.

లెక్చర్ అతనికి వినపడలేదు. హాస్టల్ బెల్లు వినపడలేదు. ఆనందాన్ని ఎలాగ అంగీకరింప చెయ్యడం అనే అతని ఆలోచన.

"భోంచేద్దాం రా బ్రదర్, గంటయింది" అంటూ రాత్రి ఆనందం గోవిందరావుని పిల్చాడు.

గోవిందరావుకో ఆలోచన తట్టింది.

"నేను రాను" అన్నాడు.

"ఏం?"

"నా కాకలవడం లేదు."

కొంచెం ఆగి ఆనందం "ఓలా అయితే నీకా ఉత్తరం యిచ్చేస్తాను" అన్నాడు జాలిపడ్డ వాడిలాగ.

గోవిందరావు గంతువేసి "చెప్పు" అన్నాడు

ఆనందం వేళ్ళుమడిచి, లెఖ్కపెడుతూ "ఒకటోది, పది రూపాయలు చెల్లించడం" అన్నాడు. టేబిల్‌మీద పది రూపాయల నోటు పడడమూ, అది ఆనందం జేబులో వెయ్యడమూ జరిగింది.

"రెండోది, ఎప్పుడూ ఆ ఉత్తరం గురించి నాతో మాట్లాడన మాట ఇవ్వడమూ" అన్నాడు.

గోవిందరావు ప్రమాణం చేశాడు. ఆనందరావు పుస్తకం మధ్యనించి నీలికవరుతీసి అతనికిచ్చాడు. గోవిందరావు తెల్లబోయాగ ఆ కవరుని ఆనందరావు విప్పలేదు!

"ఉత్తరం విప్పలేదేమిరా?" అన్నాడు గోవిందరావు.

"నీకే తెలుస్తుంది—కాని ప్రమాణం మరచిపోతున్నా"

ఆనందం గోవిందరావుని వదలి భోజనానికి వెళ్ళాడు.

డేట్‌స్టాంపూ, అడ్రసూ చూచాడు గోవిందరావు. 16వ తారీఖు ముద్దర వుంది. అడ్రస్ ఎవరు వ్రాశారో కాని, స్త్రీ హస్తం కావ డానికి ఎక్కువ వీలు వుంది. వాసన చూశాడు....తానువాడే సెంటే.

వణకుతోన్న చేతులతో ఉత్తరం విప్పాడు.

రూమ్....

—హాస్టల్. 15. 1.

ప్రియమిత్రమా!

నీకు ఉత్తరాలు వస్తే రావచ్చుకాని, నాకు రాలేదని ఎందు కంత తేలిక! స్వోత్కర్ష నీలో హద్దులు దాటుతోంది....

నీకు బుద్ధిచెప్తున్నాను....

పోయిన డబ్బు పోయిందికాని కాస్త సానుభూతి చూపడం నేర్చుకో.

నీ ధన నష్టానికి నా సానుభూతి.

భవదీయుడు

పరమానందం.

షరా:—రేపు కాంటీన్‌లో నీకు పార్టీ ఇస్తాను. ఉదయం 7-35 కి.

(సోమర్‌సెట్ మాఘంకి కృతజ్ఞతతో)